సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్

ఇచ్చింది రెండు రోజుల పనే..

- రెండు నెలలంటూ ప్రచారమేంటి? • నేత కార్మికులను ఆదుకోవాలి
- 19న ఆసాముల సమావేశాన్ని విజయవంతం చేయండి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్

కలెక్టరేట్, జూలై 16: సిరిసిల్లలోని పవర్‌లూం కార్మికులకు ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్లు ఇచ్చింది కేవలం రెండు రోజుల పని అని.. దానికి రెండు నెలల ఉపాధి కల్పించామంటూ ప్రచారం చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ మండిపడ్డారు. మంగళవారం బీవైనగర్‌లోని అమృతలాల్ శుక్లా కార్మిక భవన్ సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆసాముల ముఖ్య నాయకుల సమావేశం గోనె పరశురాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మూశం రమేశ్ మాట్లాడుతూ, జూలై 19న ఉదయం 10గంటలకు సిరిసిల్ల నెహ్రూనగర్‌లోని భవానీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి ఆసాములందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలతో గత ఏడు నెలల నుంచి ఆసాములు, కార్మికులకు పని లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఇప్పటికే పది మంది కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని వాపోయారు. రోజురోజుకు పరిస్థితి తీవ్రంగా మారుతుందని, సమస్యలు పరిష్కారం కాకుంటే కార్మికులు, ఆసాముల పరిస్థితి మరింత విషమంగా మారే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వం 18లక్షల మీటర్లు ఆర్డర్ ఇచ్చి రెండు, మూడు నెలలు ఉపాధి కల్పించామంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. సుమారు 8 నుంచి 10కోట్ల మీటర్ల ప్రభుత్వ వస్త్రాల ఆర్డర్ ఇస్తేనే ఆసాములు, కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలన్నారు. అలాగే 10 హెచ్‌పీల వరకు ఆసాములకు ఉచిత కరెంట్ ఇచ్చి ఎక్కువ పవర్‌లూమ్స్ ఉన్న వాళ్లకు సబ్సిడీ కొనసాగించాలన్నారు. అందరూ కలిసి పోరాటం చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. సమావేశంలో ప్రకాశ్‌రావు, కోడం రమణ, కొండ సుభాష్, కోడం రమేశ్, బూర శ్రీనివాస్, గోవిందు కనకయ్య, రాపెల్లి రఘుపతి, దూస అశోక్, చంద్రకాంత్, సంతోష్, చంద్రమౌళి, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజన్నకు ప్రత్యేక పూజలు

- 24గంటలపాటు అఖండ భజన

వేములవాడ టౌన్, జూలై 16: తొలి ఏకాదశిని పురస్కరించుకుని రాజన్న ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు నమిలకొండ ఉమేశ్ వెల్లడించారు. ఉదయం స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనన్నట్లు తెలిపారు. సాయంత్రం 6.30గంటల నుంచి శ్రీ రుక్మిణీ విఠలేశ్వర స్వామివారికి పంచోప నిషత్తుల ద్వారా అభిషేకం, మహాపూజ ఉంటుందని, నాగిరెడ్డి మండపంలో ఆహోరాత్రి పర్యంతం అఖండ భజన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
OLD AGE HOME
★ఒంటేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325763-All
CHANGE OF NAME
★I, KONAPARTHI ROJA, D/o KONAPARTHI RAJENDHAR, Beedi Roller, shall henceforth be known as NARUKULLA ROJA W/o. RAMESH.
NTK-000
CHANGE OF DATE OF BIRTH
★I, YELLALA KONDAL REDDY Father of No.16122727H, Rank: NK, Name: YELLALA KIRAN KUMAR, R/o. H.No.4-64/6/3, Village: Porandla, Mandal: Thimmapur, Dist: Karimnagar, State: Telangana, Pin:505469, My Correct Date of Birth is 02/02/1971 but not 02/02/1972 vide affidavit dated 13/02/2024, Henceforth My Date of Birth is 02/02/1971 for all Purposes.
NTK-325463
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571

దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, జూలై 16: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, దమ్మన్నపేట ఆదర్శ పాఠశాలలో రెండు నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మండల విద్యాధికారి బన్నాజి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు విద్యాలయాల్లో హెడ్ కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏడో తరగతి పాసై మహిళలు ఈ నెల 22లోగా మండల వనరుల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

లక్ష్మీపూర్‌లో డ్రై డే

సిరిసిల్ల రూరల్, జూలై 16: తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో మంగళవారం డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కలియతిరిగి, సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇండ్లలోకి వర్షపు నీరు నిల్వ లేకుండా చేయడంతో దోమల లార్వాను అరికట్టే పద్ధతులపై వివరించారు. ఇక్కడ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాయిమా, హెచ్ ఈవో లింగం, కార్యదర్శి మౌనిక, సాయి కుమార్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నియామకం

సిరిసిల్ల రూరల్, జూలై 16: నేషనల్ హ్యూమన్ రైట్స్, జస్టిస్ మూమెంట జిల్లా జాయింట్ సెక్రటరీగా జక్కుల అన్వేశ్‌యాదవ్ నియామకయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హమీద్, జాతీయ అధ్యక్షుడు అర్షద్‌ఖాన్, చీఫ్ సెక్రటరీ సయ్యద్ షబ్బీర్ అలీ మదానిలకు సహకరించిన సభ్యులకు అన్వేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చందుర్తి, జూలై 16: మండలంలో 18మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్ మంగళవారం అందజేశారు. ఇక్కడ నేతలు గొట్టె ప్రభాకర్, సత్యంగౌడ్, తదితరులు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

రుద్రంగి, జూలై16: మద్యం మత్తులో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రుద్రంగిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నేవూరి ఆంజనేయులు(28) తరుచూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి ఆమెతో గొడవపడ్డాడు. తర్వాత ఇంట్లో పిల్లల కోసం కట్టిన ఉయ్యాలకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ అశోక్ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

ఎల్లారెడ్డిపేట, జూలై 16: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన మండల కేంద్రానికి చెందిన మేడి శ్రీలేశ్ గౌతం రెండో ఫేస్ కౌన్సెలింగ్‌లో బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీలేశ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

చినుకు పడక.. సాగు సాగక

నిజామాబాద్ గ్రామంలో చుక్క నీరు లేక బోసిపోయిన గద్దె గుట్ట చెరువు

- ఊరిస్తున్న రుతు పవనాలు
- కార్తెలు ముగుస్తున్నా.. కరుణించిన వరుణుడు
- తుకాలు పోసి ఎదురుచూస్తున్న రైతులు
- బోసిపోయిన చెరువులు, కుంటలు

కోనరావుపేట మండలంలో వరుణుడి కరు ణ కరువైంది. గడిచిన ఐదేళ్లలో పరిస్థితిని గమనిస్తే కార్తె, కార్తెకు కుండపోతగా కురిసిన వానలు ఈ ఏడాది మందగించాయి. దీంతో మండలానికి గుండెకాయ అయిన నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుతోపాటు చెరువులు, కుంటలు నీరు లేక నెర్రెలు బారుతున్నాయి. ఈ ఏడాది మే నెలలోనే తొలకరి తొంగి చూసినగానీ వానల జాడ కనిపించడంలేదు. జూన్ మొదటి వారంలోనే రుతు పవనాలు ఆగమనం చేసినా.. చిరుజల్లులకే పరిమితమయ్యాయి. దీంతో రోహిణి కార్తెలో వర్షాలు కురవడంతో రైతులు ముందుగానే పత్తి పంట సాగుచేశారు. వరి నారుకు మృగశిర, ఆరుద్ర కార్తెలో తుకం పోశారు. తుకంలో నారు మంచిగానే ఎదిగి నాటుకు సిద్ధమవుతున్నా.. వర్షాలు కురియకపోవడంతో ఆయకట్టు కింద రైతుల వరినారు మడులు ముదిరిపోయి ఎండిపోతున్నాయి. అంతేకాకుండా బోరు, బావుల్లో నీటి శాతం తగ్గడంతో దుక్కి దున్నకుండా చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద పూసల కార్తె ప్రారంభమైన ఇప్పటివరకు భారీ వర్షం పడకపోవడంతో రైతన్నలు దిగాలు చెందుతున్నారు. ఇక పత్తి సాగు చేసిన రైతులు కలుపు మొక్కలు తొలగించి రసాయన ఎరువులు వేశారు. వర్షం పడితే మొక్కలు ఎదుగుతాయని ఆశతో చూస్తున్నారు.

కల్పతరువు నిమ్మపల్లి ప్రాజెక్టు

కోనరావుపేట మండలంలో చెరువులు, కుంటలు 93ఉండగా, ఇందులో ఆయకట్టు చెరువులు 60, కుంటలు 33ఉన్నాయి. గతేడాది జూన్ మొదటి వారంలోనే చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. కానీ ప్రస్తుతం నీళ్లులేక బోసిపోయాయి. ప్రధానంగా మండలానికి నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు గుండెకాయలాంటిది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 19 అడుగులు కాగా, ప్రస్తుతం చుక్క నీరు లేక బోసిపోయింది. ఎగువన నుంచి వరద రాకపోవడంతో ప్రాజెక్టు పరిధిలో ఉన్న 2,500 ఎకరాల ఆయకట్టు వరి సాగు నిలిచిపోయింది. మూలవాగు పారితేనే బోర్లు, బావుల్లో నీరు వృద్ధి చెందుతాయి. తద్వారా రైతుల సాగు పనులు ముమ్మరంగా సాగుతాయి. వర్షాలు సమృద్ధిగా కురిసి.. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండలా మారాలని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

ప్రస్తుతానికి వానకాలం పంటల పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. భారీ వర్షాలు కురువకున్నా.. పత్తి పంటకు లాభం చేకూర్చే వర్షాలు పడుతున్నాయి. కానీ వరి సాగుకు మాత్రం ఆశించిన స్థాయిలో వానలు పడడంలేదు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిస్తేనే ప్రాజెక్టు, చెరువులు, కుంటలు నిండుతాయి. తద్వారా ఆయకట్టు రైతులతోపాటు మూలవాగును అనుకొని ఉన్న రైతులు వరినాట్లు వేయగలుగుతారు. రైతులు ఆందోళన చెందవద్దు.

– వెంకట్రావమ్మ, ఏవో (కోనరావుపేట)

> మేఘాలు గర్జించినా.. కారు మబ్బులు కమ్ముకున్నా.. చినుకు కరువవుతోంది. దీంతో ప్రధాన జలవనరులైన చెరువులు, కుంటలు చుక్క నీరు లేక బోసిపోయాయి. బోర్లు, బావుల కింద వరి నాట్లు వేద్దామనుకున్నా.. ఈ ఏడాది వేసవి తాపానికి భూగర్భజలాలు అడుగంటిపోయాయి. వానకాలం సీజన్ ప్రారంభమైనా.. సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం వరుణుడు ముఖం చాటేయడంతో.. అన్నదాతలు తుకం పోసి చినుకు కోసం దిగాలుతో ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.
> – కోనరావుపేట, జూలై 16

దుక్కులు ఎండిపోతున్నయి..

ఈ ఏడాది వర్షాలు ముందుగానే మురిపించి ముఖం చాటేశాయి. సమృద్ధిగా కురుస్తాయనే ఆశతో వరి నార్లు పోశాం. కానీ వరి నారు ఎదిగి నాటు కోసం సిద్ధంగా ఉన్నది. ఇప్పుడెమో వర్షాలు కురియకపోవడంతో దుక్కులు ఎండిపోతున్నయి. నాకు పదెకరాల పొలం ఉండగా, బోరు కింద మూడెకరాలు నాటేసిన. కొండం చెరువులో నీరు లేక మిగతా పొలం బీడే ఉన్నది. భారీ వర్షాలు కురిస్తే పంట పొలాలకు నీళ్లందుతాయి.

– దండు శ్రీనివాస్, యువరైతు (కోనరావుపేట)

నారు ముదిరిపోతాంది

నాటి కాలం నుంచి కార్తులకు అనుగుణంగానే నేను వరి సాగు చేస్తున్నా. మృగశిర కార్తెలోనే నాలుగెకరాలకు వరి నారు పోసిన. వర్షాలు పడకపోవడంతో బావిలోకి నీరు రాలేదు. దీంతో 20 గుంటల వరకు బావి నీళ్లతో నాటేసిన. మిగతా మూడన్నర ఎకరాలు నీళ్లు లేక దున్నకుండానే వదిలేశాను. నారు ముదిరిపోవడంతోపాటు దుక్కులు బీడుగా మారాయి. వర్షం పడితే బావిలోకి నీరు వస్తేనే నాటు వేయగలుగుతాం.

–ఆసరి చంద్రయ్య, రైతు, ధర్మారం(కోనరావుపేట)

నిజామాబాద్ గ్రామశివారులో ఎండిపోయిన వరి నారుమడి

మహిళలకు సమాన హక్కు చట్టాలు

వేములవాడ, జూలై 16: చట్టాల్లో మహిళలకు కూడా సమాన హక్కులు ఉన్నాయని మహిళా సాధికారిక జిల్లా కోఆర్డినేటర్ రోజా పేర్కొన్నారు. వంద రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పని చేస్తున్న చోట మహిళలు వేధింపులకు గురయితే హెల్ప్ లైన్ నంబర్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కి కాల్ చేసి సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచి చర్యలు తీసుకుంటారని వివరించారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్ మోక్షారాణి, వార్డు అధికారి పరశురామ్, ఆర్పీ దివ్య, ఆశ కార్యకర్త కవిత, ఆయా, తదితరులు ఉన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయించండి

- మాజీ మంత్రి కేటీఆర్‌కు డిగ్రీ కళాశాల నిర్వాహకుల విజ్ఞప్తి

మాజీ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిగ్రీ కళాశాలల నిర్వాహకులు

సిరిసిల్ల రూరల్, జూలై 16: మూడేండ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయించాలని సిరిసిల్ల డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో వారు కేటీఆర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్థిక లేమితో కళాశాలల యాజమాన్యాల పరిస్థితిని అర్థం చేసుకుని, అసెంబ్లీ వేదికగా ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కేటీఆర్, 2019లో తమ ప్రభుత్వం అధికారంలో వచ్చే నాటికి రూ.1,800 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, అవన్నీ సమయానుకూలంగా చెల్లించామని గుర్తు చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో కాలేజీ యాజమాన్యాలకు రావాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి చేసి, విడుదలయ్యే వరకు కొట్లాడి సాధించే ప్రయత్నం చేస్తామని భరోసానిచ్చారు. వీరిలో డిగ్రీ కళాశాలల నిర్వాహకులు గుగ్గిళ్ల జగన్‌గౌడ్, గెంట్యాల భూమేశ్, కొలనూరి శేఖర్‌రెడ్డి, రేశం శ్రీకాంత్, మారం వేణుగోపాల్ ఉన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

- లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతాం
- బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

కలెక్టరేట్, జూలై 16: హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతామని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హాస్టల్ పునర్‌ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తోందని, చాలా మంది విద్యార్థులు తిరిగి సంక్షేమ హాస్టళ్లకు చేరుకున్నారు గానీ.. అక్కడ మాత్రం వసతుల లేవన్నారు. అపరిశుభ్రత, విరిగిన కిటికీలు, పగిలిన తలుపులు, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిన పరిసరాలు, అపరిశుభ్రంగా మారిన టాయిలెట్లతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సరైన ఆహారం లేక అలమటిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హాస్టళ్లలో వసతులు కల్పించాలని కోరారు. లేకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు కోడం వెంకటేశ్, శ్రీనివాస్, తిరుపతి, పోతర్ల వంశీ, కోడి రోహిత్, తెంబరవేని శ్రీనివాస్, వావిలాల సాయికుమార్, జయచందర్ ఉన్నారు.

నేడు బీసీఎంలో కంటి ఆపరేషన్లు

బోయినపల్లి, జూలై16: కొదురుపాక బుచ్చమ్మ చంద్రమ్మ మెమెరియల్ (బీసీఎం) కంటి దవాఖానలో బుధవారం ఉచితంగా 40 మందికి కంటి ఆపరేషన్లు చేయనున్నట్టు దవాఖాన వ్యవస్థాపకుడు డా వైరాగ్యం రాజలింగం–రీతాబహదుర్‌షా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆపరేషన్ల అనంతరం కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి డా రాజలింగం కంటి పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

రుద్రంగి, జూలై 16: భార్యతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయిన భర్త అదృశ్యమైన ఘటన రుద్రంగి మండలంలో చోటు చేసుకున్నది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం చింతామణితండా గ్రామానికి చెందిన గుగులోత్ హరిసింగ్(60) తన భార్య దేవితో గొడవపడ్డాడు. ఈ నెల 13న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామస్తులు, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు దేవి ఠాణాలో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

కోటగిరి వెంకటయ్యకు ఘన నివాళి

వేములవాడ, జూలై 16: వేములవాడ ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కోటగిరి వెంకటయ్య వర్ధంతిని మంగళవారం ఆర్యవైశ్య సత్రంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇక్కడ ఆర్యవైశ్య వాసవి నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు రేణుకింది అశోక్, మేనేజర్ మడూరి శ్రీనివాస్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు కట్కూరి శ్రీనివాస్, చీకోటి నరహరి, పొలాస నరేందర్, నగుబోత్ రవీందర్, కిషన్, దశరథం, కుమార్, శ్రీనివాస్, నాగరాజు, అనిల్, ఉన్నారు.

గొలుసు చోరీకి పాల్పడిన ఒకరి అరెస్ట్

సిరిసిల్ల రూరల్, జూలై 16: తంగళ్లపల్లి మండలం మల్లాపూర్‌లో చోరీలకు పాల్పడిన దొంగను పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 21న రాత్రి వేళలో మల్లాపూర్‌లో తన ఇంటి ముందు మంచంపై నిద్రిస్తున్న బాసా ఎల్లవ్వ మెడలోంచి మూడు తులాల పుస్తెలతాడు, తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్లను అపహరించి బైక్‌పై పారిపోయారు. ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. దుండగులు ఎత్తుకెళ్లిన సెల్‌ఫోన్ల ఆధారంగా మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులు, సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మరొకరిని గుర్తించారు. సోమవారం నర్సింహులును సిరిసిల్లలో పట్టుకుని కేసు నమోదు చేశారు. మూడు తులాల గొలుసు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మొగిలి తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సిరిసిల్ల రూరల్, జూలై 16: తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమ పాత జ్ఞాపకాలను పంచుకుని ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

గ్రామసభ రసాభాస

ఎల్లారెడ్డిపేట, జూలై 16: వెంకటాపూర్‌లో గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం గ్రామసభ నిర్వంచారు. గ్రామంలోని సమస్యలు, అవినీతిపై అధికారులను కొందరు యువకులు నిలదీశారు. 44ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేయగా, నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. స్థలాన్ని కేటాయించి, హద్దులను ఏర్పాటు చేయాలని యువకులు పట్టుబట్టారు. నిబంధనల మేరకు కేటాయించారా లేదా పరిశీలిస్తామని గ్రామస్తులకు అధికారులు హామీఇచ్చారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

బోయినపల్లి, జూలై 16: మండలంలో మంగళవారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కోరెం, బోయినపల్లి, విలాసాగర్, తడగొండ గ్రామాల్లో పీరీలను డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించగా, భక్తులు కొబ్బరికాయలు కొట్టి.. దస్తీలు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. పులి, ఎరుకల నాంచరి వేషధారణలతో సందడిగా చేశారు.

బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు

వేములవాడ టౌన్, జూలై 16: సాయినగర్, ఉప్పుగడ్డ వీధుల్లో గల కేరళ మోడల్ స్కూల్ విద్యార్థులు బద్ది పోచమ్మ అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, టీచర్లు ఉన్నారు.

తాగునీటి సమస్య రానివ్వద్దు

బోయినపల్లి, జూలై 16: ప్రజలకు తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని జడ్పీ సీఈవో ఉమారాణి సూచించారు. కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో బోర్‌వెల్ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆమె వెంట ఎంపీడీవో జయశీల, కార్యదర్శి అంజలి, తదితరులు ఉన్నారు.

'తులం బంగారం' హామీ ఏమైంది?

ముస్తాబాద్ (కలెక్టరేట్), జూలై 16: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ప్రకటించిందని.. ప్రస్తుతం ఆ హామీ ఎక్కడ పోయిందని బీఆర్ఎస్ ముస్తాబాద్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు ప్రశ్నించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవలే ముస్తాబాద్ మండలంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి 66మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయడం సంతోషమే కానీ.. లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలు అవుతున్నా.. ఎప్పటి నుంచి తులం బంగారంతో కలిపి కల్యాణ లక్ష్మి చెక్కులు ఇస్తారో ప్రకటించాలన్నారు. ఆయన వెంట ముస్తాబాద్ పట్టణాధ్యక్షుడు నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

ఇల్లంతకుంట, జూలై 16: పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అనాథ విద్యార్థి శీలం వివేక్‌కు మాజీ సర్పంచ్ గొడిసెల జితేందర్‌గౌడ్ స్టడీమెటీరియల్ అందజేశారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వివేక్‌కు స్టడీ మెటీరియల్, బ్యాగ్, స్టడీ టైర్, ప్యాడ్ అందించినట్టు జితేందర్‌గౌడ్ తెలిపారు. ఇక్కడ నాయకులు గన్నారం నర్సయ్య, సంజీత్, రజినీకాంత్, జాన్ సుందర్, తదితరులు ఉన్నారు.

పదవి లేకున్నా.. ప్రజా సేవలో ఉంటాం

మాజీ ఎంపీపీ మానస, మాజీ ఎంపీటీసీలను సన్మానిస్తున్న వెంకటరమణారెడ్డి, నేతలు

సిరిసిల్ల రూరల్, జూలై 16: పదవి లేకున్నా.. ప్రజా సేవలో ఉంటామని, మాజీ మంత్రి కేటీఆర్ అనుగుణంగా సేవలందిస్తున్నామని మాజీ ఎంపీపీ పడిగెల మానస పేర్కొన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్‌లో బీఆర్ఎస్ సీనియర్ నేత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ప